సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
బుధవారం । 18 । జనవరి । 2023

న్యూస్‌రీల్

నేత్రపర్వంగా రామయ్య నిత్యకల్యాణం


నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుక మంగళవారం నేత్రపర్వంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపించారు. కాగా, మంగళవారాన్ని పురస్కరించుకుని ఆంజనేయస్వామి ఆలయంలో అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సమగ్ర సమాచారంతో హాజరు కావాలి

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లాలో ఈనెల 19న ప్రారంభం కానున్న కంటి వెలుగు కార్యక్రమానికి సంబంధించి బుధవారం ఉదయం 11 గంటలకు నిర్వహించే వీడియో కాన్ఫరెన్స్‌కు సమగ్ర సమాచారంతో హాజరు కావాలని కలెక్టర్ అనుదీప్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. కంటి వెలుగు కార్యక్రమ ఏర్పాట్లపై మండల ప్రత్యేక అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఎంపీఓలు, వైద్యాధికారులు, 48 కంటి వెలుగు కేంద్రాల వైద్యులు, నేత్ర వైద్య నిపుణులు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, పంచాయతీ కార్యదర్శులు, మెప్మా సిబ్బంది సమగ్ర సమాచారంతో హాజరు కావాలని సూచించారు.

ఢిల్లీ పీఠంపై బీఆర్ఎస్ జెండా ఎగరాలి

కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డి


మంత్రి మల్లారెడ్డికి జ్ఞాపిక అందజేస్తున్న ఈఓ

భద్రాచలం: వచ్చే ఎన్నికల్లో ఢిల్లీ పీఠంపై కేసీఆర్ నాయకత్వాన బీఆర్ఎస్ జెండా ఎగరాలని భద్రాద్రి రామయ్యను వేడుకున్నట్లు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ ఈవో శివాజీ, అర్చకులు ఆయనకు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. అంతరాలయంలో మూలమూర్తులను, ఉపాలయాలలో స్వామి వార్లకు పూజలు చేశారు. పండితులు వేదాశీర్వచనం చేయగా, ఈఓ స్వామి వారి ప్రసాదాలు, జ్ఞాపిక అందజేశారు. అనంతరం మల్లారెడ్డి మాట్లాడుతూ.. రాముడు విజయం సాధించినట్లు పార్లమెంట్ ఎన్నికల్లోనూ బీఆర్ఎస్ విజయం సాధించేలా చూడాలని ప్రత్యేక పూజలు చేసినట్లు వెల్లడించారు. దేశంలో బీజేపీ ప్రజావ్యతిరేక పాలన సాగిస్తోందని ఆరోపించారు. తెలంగాణలో సీఎం కేసీఆర్ పాలన ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా ఉందన్నారు.

సింగరేణిలో సంక్రాంతి సంబురాలు

ఆకట్టుకున్న బొమ్మల కొలువు


వేడుకల్లో సింగరేణి సేవా మహిళలు

మణుగూరుటౌన్: మణుగూరు ఏరియా సింగరేణి కాలరీస్ కంపెనీ ఆధ్వర్యంలో ఏరియా ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు సంక్రాంతి సంబురాలు ఘనంగా నిర్వహించారు. అందులో భాగంగా మంగళవారం సీ–టైప్ కాలనీలోని ఇల్లెందు క్లబ్‌లో బొమ్మల కొలువు నిర్వహించారు. సింగరేణి ఉద్యోగుల కుటుంబాలకు చెందిన సేవా మహిళలు, ఇల్లెందు క్లబ్ కమిటీ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబురాలతోపాటు బొమ్మల కొలువు నిర్వహించారు. అనంతరం మహిళలు ఆటపాటలతో అలరించారు. కార్యక్రమంలో ఏరియా జీఎం వెంకటేశ్వరరెడ్డి, సేవా అధ్యక్షురాలు సునీత, హరిణి, వాణి, మధురవాణి, షాలెంరాజు, సువర్ణ, అనిత, ప్రసన్న, స్వర్ణలత, నళిని, అపర్ణ, ఆఫ్రోజ్, నాగలక్ష్మి, ఏజీఎం నాగేశ్వరరావు, ఎస్వోటూ జీఎం లలిత్‌కుమార్, ఏజీఎం (సివిల్) డి.వెంకటేశ్వర్లు, ప్రాజెక్టు అధికారులు శ్రీనివాసాచారి, లక్ష్మీపతిగౌడ్, ఏజీఎం నర్సిరెడ్డి, డాక్టర్ శేషగిరిరావు, వీరభద్రుడు పాల్గొన్నారు.

పెద్దమ్మతల్లిని దర్శించుకున్న ఇంటెలిజెన్స్ డీఐజీ

పాల్వంచరూరల్: మండలంలోని కేశవాపురం – జగన్నాథపురం గ్రామాల మధ్య కొలువై ఉన్న శ్రీ పెద్దమ్మతల్లి అమ్మవారిని ఇంటెలిజెన్స్ డీఐజీ చౌహాన్ మంగళవారం దర్శించుకున్నారు. అర్చకులు ఆయనకు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికి అమ్మవారి శేషవస్త్ర ప్రసాదాలను అందజేశారు. ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య కూడా అమ్మవారిని దర్శించుకున్నారు.


చౌహాన్‌ను సత్కరిస్తున్న అర్చకుడు

బీఆర్ఎస్ తొలి సభకు వేదికగా ఖమ్మం

- హాజరుకానున్న నాలుగు రాష్ట్రాల సీఎంలు సహా ముఖ్యనేతలు
- గులాబీ వాకిలిలా మారిన నగరం
- ముందే చేరుకున్న ఇతర జిల్లాల ప్రజాప్రతినిధులు
- వివిధ జిల్లాల పోలీస్ బలగాలతో బందోబస్తు
- ముస్తాబైన నూతన కలెక్టరేట్ సముదాయం

ఖమ్మంలో జరిగే బీఆర్ఎస్ బహిరంగ సభకు ముస్తాబైన వేదిక



ఆతిథ్య ఖమ్మం

చారిత్రక సభకు ఆతిథ్యమిచ్చేందుకు ఖమ్మం సిద్ధమైంది. బీఆర్ఎస్ తొలి బహిరంగ సభ ఖమ్మంలో జరగనుండడంతో సభావేదిక, చుట్టుపక్కల ప్రాంతాలే కాకుండా నగరమంతా గులాబీ నగిషీలు తొడుక్కుంది. రాష్ట్ర వైద్య, ఆరోగ్య, ఆర్థిక శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు, రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ సారథ్యాన సభా ప్రాంగణం, నగరం గులాబీ హంగులద్దుకుంది. అంతేకాకుండా నూతన కలెక్టరేట్ సముదాయం పుష్పగుచ్ఛంలా ముస్తాబైంది. ముఖ్యఅతిథులు తొలుత కలెక్టరేట్‌ను ప్రారంభించి.. ఆ తర్వాత రాష్ట్రవ్యాప్తంగా రెండో దశ కంటి వెలుగును ప్రారంభిస్తారు. అలాగే మెడికల్ కళాశాల శిలాఫలకాన్ని ఆవిష్కరించాక ఆవిర్భావ సభకు హాజరవుతారు.

–సాక్షిప్రతినిధి, ఖమ్మం


ఖమ్మంలో జరిగే బీఆర్ఎస్ బహిరంగసభా స్థలిలో సిద్ధం చేసిన గ్యాలరీలు

సభకు ముందే సందోహం..

ఖమ్మం సమీపాన వి.వెంకటాయపాలెం వద్ద ఏర్పాటు చేసిన బహిరంగ సభ బుధవారం జరగనుండగా.. ముందురోజైన మంగళవారమే 'జన' సందోహం కనిపించింది. మంత్రులు హరీశ్‌రావు, పువ్వాడ అజయ్‌కుమార్, జగదీష్‌రెడ్డి, ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్, మల్లారెడ్డి, ఎంపీలు నామ నాగేశ్వరరావు, వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీలు పాడి కౌశిక్‌రెడ్డి, తాతా మధుసూదన్, ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, ఫిష్ అండ్ గోట్ డెవలప్‌మెంట్ చైర్మన్ దూదిమెట్ల బాలరాజు యాదవ్ తదితరులు నూతన కలెక్టరేట్‌తోపాటు సభా ప్రాంగణాన్ని పరిశీలించారు. జన సమీకరణకు నిర్ణయించిన 13 నియోజకవర్గాలే కాక నల్లగొండ, యాదాద్రి, హన్మకొండ, వరంగల్, హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలకు చెందిన పలువురు జెడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎమ్మెల్యేలు ముందే ఖమ్మం చేరుకున్నారు. మరోవైపు వివిధ జిల్లాల నుంచి బందోబస్తుకు వచ్చిన పోలీసు బలగాలకు డీఐజీ రంగనాథ్, సీపీ విష్ణు ఎస్.వారియర్ పలు సూచనలు చేశారు. మరోపక్క ప్రజాప్రతినిధులు, నేతలతో సభాప్రాంగణం, వివిధ శాఖల అధికారులతో కలెక్టరేట్ కాంప్లెక్స్‌లో సందడి నెలకొంది.

ఫ్లెక్సీలు, జెండాల రెపరెపలు

ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రులు కేటీఆర్, పువ్వాడ, ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధుల ఫొటోలే కాకుండా ఆహుతుల ఫొటోలతో వెలిసిన గులాబీ ఫ్లెక్సీలు రెపరెపలాడుతున్నాయి. నగరంలోని శ్రీశ్రీ సర్కిల్ నుంచి సభా ప్రాంగణం వరకు ఎటు చూసినా గులాబీ జెండాలు, కటౌట్లు, ఫ్లెక్సీలు, గులాబీ తోరణాలు దర్శనమిస్తున్నాయి. టీఆర్ఎస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు అమలుచేసిన సంక్షేమ పథకాలను వివరిస్తూ ఈ కటౌట్లు వెలిశాయి.

కలెక్టరేట్ సుందరమయం..

నూతన కలెక్టరేట్ మొత్తాన్ని వివిధ ప్రాంతాల నుంచి తెప్పించి పుష్పాలతో అలంకరించారు. ముందు భాగంలో ఫ్లోర్లు, శాఖల వారీగా వివరాలతో బోర్డు ఏర్పాటుచేశారు. ఇక కంటివెలుగు రెండో దశను రాష్ట్రస్థాయిలో నలుగురు సీఎంలు ఇక్కడే ప్రారంభిస్తుండటంతో ఏర్పాట్లు చేశారు. నూతన కలెక్టరేట్‌లోని హాల్‌లో వైద్య ఆరోగ్యశాఖ బృందం పరీక్షలు, అద్దాల పంపిణీకి ఏర్పాట్లు చేసింది. మంగళవారం రాత్రి జిల్లాకు చేరుకున్న సీఎస్ శాంతికుమారి నూతన కలెక్టరేట్‌తోపాటు కంటి వెలుగు ఏర్పాట్లను వైద్య, ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు, కలెక్టర్ గౌతమ్‌తో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమాన్ని నలుగురు సీఎంలు లాంఛనంగా ప్రారంభించడమే కాక మెడికల్ కళాశాల శంకుస్థాపన శిలాఫలకాన్ని కూడా కలెక్టరేట్‌లోనే ఆవిష్కరిస్తారు.

జాతరలా తరలివచ్చేలా..

బీఆర్ఎస్ తొలి సభ ఖమ్మంలో ఏర్పాటుచేయనున్నట్లు ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించినప్పటి నుంచి పార్టీ యంత్రాంగం జన సమీకరణకు సర్వశక్తులొడ్డుతోంది. ఉమ్మడి ఖమ్మం జిల్లాతో పాటు సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లాల్లోని 13 నియోజకవర్గాల నుంచి జన సమీకరణకు ఆరుగురు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు 18 మందితో నియోజకవర్గాల వారీగా కమిటీలు ఏర్పాటయ్యాయి. ఆయా కమిటీల నేతృత్వాన అన్ని నియోజకవర్గాల్లో సన్నాహక సమావేశాలు ఏర్పాటు చేసి జనం జాతరలా తరలివచ్చేలా సూచనలిచ్చారు. బీఆర్ఎస్ తొలి సభ కావడం, నాలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, మరో ఇద్దరు జాతీయ స్థాయి పార్టీల నేతలు ఒకే వేదికపైకి వస్తుండడంతో సభ విజయవంతాన్ని ఈ బృందం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది.

సభావేదిక ప్రత్యేకతలు.. సీఎంల పర్యటన ఇలా..

సభా ప్రాంగణం	: 100 ఎకరాలు
వేదిక	: జర్మనీ టెక్నాలజీ వాటర్, ఫైర్ రూఫ్ (గులాబీరంగు)
హాజరయ్యే జనం (అంచనా)	: 5 లక్షలు
ప్రాంగణంలో కుర్చీలు	: లక్ష
వేదికపై కూర్చునేది	: సీఎంలు కేసీఆర్, కేజ్రీవాల్, పినరయి విజయన్, భగవంత్‌సింగ్‌మాన్, మాజీ సీఎం అఖిలేష్‌యాదవ్, సీపీఐ జాతీయ నేత డి.రాజా, సీపీఎం, సీపీఐ రాష్ట్ర కార్యదర్శులు తమ్మినేని వీరభద్రం, కూనంనేని సాంబశివరావుతో పాటు పువ్వాడ నాగేశ్వరరావు, ఉమ్మడి జిల్లా మంత్రి పువ్వాడ అజయ్, ఉమ్మడి జిల్లా ముఖ్యనేతలు, ఎంపీలు,ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, రాష్ట్ర మంత్రులు
సభావేదిక ముందు	: ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ చైర్మన్లు, ఇతర ముఖ్య అతిథులు
అధ్యక్షత	: ముఖ్యమంత్రి కేసీఆర్
ప్రసంగించేది	: సీఎంలు పినరయ్ విజయన్, భగవంత్ సింగ్‌మాన్, కేజ్రీవాల్,అఖిలేష్ యాదవ్, డి.రాజా, చివరన సీఎం కేసీఆర్
సభా సమయం	: మధ్యాహ్నం 2.30నుంచి సాయంత్రం 5 గంటలకు వరకు.

నిఘా నీడలో ఖమ్మం!

- 5,210 మంది పోలీసులతో బందోబస్తు
- ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి
- ఇప్పటికే చేరుకున్న ఇతర జిల్లాల పోలీసులు


బందోబస్తుపై ఉద్యోగులకు సూచనలు చేస్తున్న అధికారి



పార్కింగ్ బోర్డులు ఏర్పాటుచేస్తున్న పోలీసు సిబ్బంది

ఖమ్మంక్రైం: బీఆర్‌ఎస్ సభ సందర్భంగా నాలుగు రాష్ట్రాల సీఎంలు, ఇతర ముఖ్య నేతలే కాకుండా ఐదు లక్షల మంది మేర కార్యకర్తలు హాజరయ్యే అవకాశం ఉండడంతో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటుచేస్తున్నారు. ఉమ్మడి ఖమ్మంతో పాటు నల్లగొండ, సూర్యాపేట, వరంగల్, కరీంనగర్, మహబూబాబాద్, రామగుండం ప్రాంతాల నుంచి నుంచి పోలీసు సిబ్బందికి విధులు కేటాయించగా వారంతా జిల్లాకు చేరుకున్నారు. వీరిలో డీఎస్పీ ఆపైస్థాయి అధికారులకు గెస్ట్‌హౌస్‌లు, హోటళ్లలో బస ఏర్పాటు చేయగా మిగతా వారికి కళ్యాణమండపాలు, హాస్టళ్లలో వసతి కల్పించారు. అలాగే, నగరంలోని వాసవీ గార్డెన్స్, మంచికంటి భవన్, తనికెళ్ల, బైపాస్‌రోడ్లలోని ఫంక్షన్ హాళ్లలో మెస్‌లు ఏర్పాటుచేశారు.

బందోబస్తుకు 5,200మంది

ఖమ్మంతోపాటు ఇతర జిల్లాలనుంచి సుమారు 5,210మంది పోలీసు సిబ్బంది బందోబస్తు విధుల్లో పాల్గొననున్నారు. ఇందులో ఏఎస్పీలు పదిమంది, ఏసీపీలు 39, సీఐలు, ఆర్‌ఐలు 139మంది, ఎస్సైలు 409మంది, ఏఎస్సైలు 530మంది, కానిస్టేబుళ్లు 1,772మంది, మహిళా కానిస్టేబుళ్లు 169మంది, హోంగార్డులు 1,005 మందితో పాటు స్పెషల్ పార్టీలు, రోప్ పార్టీ సిబ్బంది ఉన్నారు. ఇక భారీగా జనం హాజరుకానుండడంతో పిక్ పాకెటర్లు, పాత నేరస్తులపై సీసీఎస్ పోలీసులు నిఘా వేశారు. అంతేకాకుండా హైదరాబాద్ నుంచి 150మంది ఇంటిలెజెన్స్ సిబ్బంది చేరుకోగా, వీరిలో ఐజీ స్థాయి మొదలు ఉద్యోగులు ఉన్నారు.

ట్రాఫిక్ నియంత్రణపై దృష్టి

బహిరంగ సభకు వివిధ జిల్లాల నుంచి కార్యకర్తలు హాజరుకానుండడంతో ఎక్కడా ట్రాఫిక్‌కు ఇబ్బందులు ఎదురుకాకుండా పోలీస్ శాఖ దృష్టి సారించింది. ఇప్పటికే ప్రత్యేక పార్కింగ్ స్థలాలు కేటాయించగా, అక్కడ వాహనాలు నిలిపి సభకు వెళ్లేలా సూచనలు చేశారు. అలాగే, వాహనాలు వచ్చివెళ్లే మార్గాలను కూడా ప్రకటించారు. రహదారులు, బ్రిడ్జిలపై వాహనాలు ఎక్కడైనా ఆగిపోతే వెంటనే పక్కకు తొలగించేలా బోయింగ్ వాహనాలు సిద్ధం చేశారు.

ప్రారంభానికి ముస్తాబు

సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం(ఇంటిగ్రేటెడ్ డిస్ట్రిక్ట్ ఆఫీసెస్ కాంప్లెక్స్ – ఐడీఓసీ) ప్రారంభానికి ముస్తాబైంది. రాష్ట్ర ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు సహా మూడు రాష్ట్రాల సీఎంలు కలెక్టరేట్‌తో పాటు ఇక్కడి నుంచే రాష్ట్రవ్యాప్తంగా కంటివెలుగును బుధవారం ప్రారంభించనుండడంతో మంగళవారం రాత్రికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఐడీఓసీ మొత్తాన్ని అందంగా పూలతో అలంకరించి లైట్లు అమర్చడంతో రాత్రివేళ జిగేల్‌మంటూ కనిపించింది. సీఎంలు, ఇతర ముఖ్యులు కలెక్టరేట్‌లోనే మధ్యాహ్న భోజనం చేయనుండడంతో మొదటి అంతస్తు స్టేట్ చాంబర్ పక్కనే ఉన్న చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్(సీపీఓ) చాంబర్‌లో ఏర్పాట్లు చేశారు.

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్/ ఖమ్మం సహకారనగర్/రఘునాథపాలెం



కలెక్టరేట్ వెనకాల బహిరంగసభకు సిద్ధమైన వేదిక


ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్, ఎంపీ రవిచంద్ర తదితరులు


సభావేదిక వద్దకు వెళ్లే మార్గంలో గులాబీ ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లు


భద్రత ఏర్పాట్లపై ఐపీఎస్ అధికారి కార్తికేయ సూచనలు..


కలెక్టరేట్ ముఖద్వారం వద్ద పూలతో అలంకరిస్తున్న దృశ్యం


ముస్తాబైన కలెక్టర్ చాంబర్


కలెక్టరేట్ ఆవరణలో సిద్ధమైన హెలిప్యాడ్


కేరళ నుంచి వచ్చిన పోలీసు అధికారులు


ఫ్లోర్లు, శాఖల వారీగా వివరాలతో బోర్డు ఏర్పాటుచేస్తున్న సిబ్బంది


కార్యకలాపాల నిర్వహణకు సిద్ధమైన నూతన కలెక్టరేట్‌లోని ఓ విభాగం


సీఎంలు, ఇతర ముఖ్య నేతల మధ్యాహ్న భోజనానికి సీపీఓ చాంబర్‌లో చేసిన ఏర్పాట్లు


వేదికపై భద్రతను పరిశీలిస్తున్న పంజాబ్ అధికారులు

అత్యవసరమైతే తప్ప ప్రయాణాలు వద్దు

పోలీసు కమిషనర్ విష్ణు ఎస్.వారియర్


మాట్లాడుతున్న సీపీ వారియర్ పక్కన, అడిషినల్ డీసీసీ, ట్రాఫిక్ ఏసీపీ

ఖమ్మం క్రైం: ఖమ్మంలో బుధవారం జరిగే నూతన కలెక్టరేట్ భవన సముదాయ ప్రారంభోత్సవంతో పాటు బీఆర్‌ఎస్ బహిరంగ సభకు నాలుగు రాష్ట్రాల సీఎంలు, ఇతర ముఖ్య నేతలు హాజరవుతున్న నేపథ్యాన భారీ బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నట్లు సీపీ విష్ణు ఎస్.వారియర్ తెలిపారు. మంగళవారం ఆయన నూతన కలెక్టరేట్ ఆవరణలో విలేకరులతో మాట్లాడారు. బహిరంగ సభకు సుమారు ఐదు లక్షల మంది కార్యకర్తలు హాజరయ్యే అవకాశం ఉన్నందున ఎక్కడా ట్రాఫిక్ సమస్య రాకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఇందుకోసం హైదరాబాద్ నుంచి ఖమ్మం వైపు వచ్చే వాహనాలను నకిరేకల్ నుంచి, వరంగల్ నుంచి వచ్చే భారీ వాహనాలను మరిపెడ వద్ద, జంగారెడ్డిగూడెం నుంచి వచ్చే భారీ వాహనాలను తిరువూరు వద్ద మళ్లించనున్నట్లు తెలిపారు. అలాగే, ఉదయం 6నుంచి రాత్రి 11గంటల వరకు వైరా రోడ్డు మీదుగా సభకు వచ్చే వారు తప్ప ఇతరుల వాహనాలకు అనుమతి ఉండదని చెప్పారు. సభకు వచ్చేవారు నగరానికి చేరుకున్నాక క్యూఆర్ కోడ్ సాయంతో పార్కింగ్ ప్రదేశాలు, సభాస్థలికి రావొచ్చని తెలిపారు. కాగా, అత్యవసర పనులు ఉంటే తప్ప ప్రజలు ప్రయాణం వాయిదా వేసుకోవాలని సీపీ కోరారు. అడిషనల్ డీసీపీ శబరీష్, ట్రాఫిక్ ఏసీపీ రామోజీ రమేష్ పాల్గొన్నారు.

పాదయాత్రగా ఖమ్మం సభకు


పాదయాత్రగా బయలుదేరిన నాయకులు, కార్యకర్తలు

టేకులపల్లి: ఖమ్మంలో బుధవారం బీఆర్‌ఎస్ బహిరంగ సభ జరగనున్న విషయం తెలిసిందే. ఈ సభకు అందరూ వాహనాల్లో వెళ్లేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలోనే టేకులపల్లి మండలం సులానగర్ కార్యకర్తలు, నాయకులు సభకు పాదయాత్రగా వెళ్లాలని నిర్ణయించారు. మంగళవారం సులానగర్ గ్రామం నుంచి నాయకులు, కార్యకర్తలు నడుచుకుంటూ బయలుదేరారు. రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు, సొసైటీ డైరెక్టర్ లక్కినేని శ్యాంబాబు జెండా ఊపి పాదయాత్రను ప్రారంభించారు. కార్యక్రమంలో ఉండేటి బసవయ్య, బోడ రమేశ్, కుమ్మరి కిరణ్, కుమ్మరిచౌదరి, బల్లెం సుధాకర్, బల్లెం చిట్టిబాబు, చింతమల్ల రాములు, కాలె వంశీ, కొప్పుల సురేశ్, ఇల్లంగి రవి, రామ్‌కుమార్, పృథ్వీ, కొట్టె సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

సైకిల్ యాత్రికుడికి స్వాగతం

బూర్గంపాడు: ఖమ్మంలో జరిగే బీఆర్‌ఎస్ సభ విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ తెలంగాణ ఉద్యమ నాయకులు కుటిక ప్రకాశ్ చేపట్టిన సైకిల్ యాత్రకు మంగళవారం సారపాకలో బీఆర్‌ఎస్ నాయకులు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ బిక్కసాని శ్రీనివాసరావు, నాయకులు జలగం జగదీష్, కొనకంచి శ్రీనివాస్, చల్లకోటి పూర్ణచంద్రరావు, బాలి శ్రీహరి, తిరుపతి ఏసుబు, మూడ్ మణి, భూక్యా కిషోర్, మోహన్, సుదర్శన్ పాల్గొన్నారు.

వేర్వేరు ఘటనల్లో ఇద్దరి మృతి

ఉరి వేసుకుని యువకుడు...


నవీన్ (ఫైల్)

టేకులపల్లి: ఉరి వేసుకుని ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మంగళవారం చోటుచేసుకుంది. మండలంలోని మూడు తండాకు చెందిన మూడు నవీన్ నాయక్(20) డిగ్రీ మధ్యలో మానేశాడు. సోమవారం స్నేహితులతో కలిసి మేడారం వెళ్లి మొక్కులు తీర్చుకుని మంగళవారం ఉదయం వచ్చా డు. సాయంత్రం 4 గంటల వరకు టేకులపల్లిలో ఉన్న ఆయన సాయంత్రం ఇంటికి వచ్చి ఎవరూ లేని సమయాన ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కాసేపయ్యాక కుటుంబీకులు చూసేసరికి మృతి చెందాడు. కాగా, నవీన్ ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది. ఘటనాస్థలానికి ఏఎస్సై భూక్యా కృష్ణ చేరుకుని వివరాలు ఆరా తీశారు. ఇక నవీన్ తన ఫేస్‌బుక్‌లో 'అకస్మాత్తుగా నేను చనిపోతే ఎవరూ ఏడవకండి.. ఒక్కసారి ఆకాశం వైపు చూసి చిరునవ్వు నవ్వి బై చెప్పండి' అని పోస్ట్ పెట్టడం గమనార్హం.

పురుగులమందు తాగి వ్యక్తి...

అశ్వారావుపేటరూరల్: పురుగులమందు సేవించి ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం .. మండలంలోని నారంవారిగూడెం గ్రామానికి చెందిన టి.దుర్గాప్రసాద్ (33) కొన్నేళ్లుగా దమ్మపేట మండలం చిన్నగొల్లగూడెం గ్రామంలోని అత్తగారి ఇంటి వద్ద ఉంటున్నాడు. ఆర్థిక ఇబ్బందులతో మనస్తాపం చెంది అక్కడే సోమవారం రాత్రి ఇంట్లో కుటుంబీకులు లేని సమయంలో పురుగులమందు సేవించాడు. గమనించిన కుటుంబీకులు కొత్తగూడెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి వైద్యం చేయిస్తుండగా మంగళవారం పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు.

సీఎంల పర్యటన షెడ్యూల్

సాక్షిప్రతినిధి, ఖమ్మం: ఖమ్మం కలెక్టరేట్ ప్రారంభోత్సవంతోపాటు బీఆర్‌ఎస్ తొలి సభలో పాల్గొనేందుకు సీఎం కేసీఆర్‌తోపాటు ఢిల్లీ, పంజాబ్, కేరళ ముఖ్యమంత్రులు అరవింద్ కేజ్రీవాల్, భగవంత్ సింగ్‌మాన్, పినరయి విజయన్, యూపీ మాజీ సీఎం అఖిలేష్ యాదవ్, సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా బుధవారం ఖమ్మం రానున్నారు. వీరి పర్యటన షెడ్యూల్ ఇలా ఉంది.

- సీఎంలు అరవింద్ కేజ్రీవాల్, భగవంత్ మాన్, పినరయి విజయన్, యూపీ మాజీ సీఎం అఖిలేష్‌యాదవ్ మంగళవారం రాత్రి హైదరాబాద్ చేరుకున్నారు.
- సీఎం కేసీఆర్‌తో కలిసి బుధవారం ఉదయం 10.10 గంటలకు బేగంపేట విమానాశ్రయం నుంచి రెండు హెలీకాప్టర్లలో బయలుదేరి 10.35 గంటలకు యాదగిరిగుట్ట చేరుకుంటారు. అక్కడ 10.40గంటలకు యాదాద్రి లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్నాక 11.40 గంటలకు బయలుదేరి మధ్యాహ్నం 12.20 గంటలకు ఖమ్మం చేరుకుంటారు.
- ఖమ్మంలో నూతన కలెక్టరేట్‌తోపాటు కంటివెలుగు రెండో దశ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు. అనంతరం అక్కడే మధ్యాహ్న భోజనం చేస్తారు.
- మధ్యాహ్నం 2.25 గంటలకు కలెక్టరేట్ కాంప్లెక్స్ నుంచి బయలుదేరి 2.30 గంటలకు బీఆర్‌ఎస్ సభాస్థలి వద్దకు చేరుకుంటారు.
- ఈ సభలో తొలుత ముందుగా సీఎం పినరయి విజయన్ మాట్లాడగానే హెలీకాప్టర్‌లో విజయవాడ బయలుదేరతారు. ఆ తర్వాత మిగతా అతిథులు ప్రసంగిస్తారు. సభ ముగిశాక కేజ్రీవాల్, భగవంత్ మాన్ సాయంత్రం 5 గంటలకు, ఆతర్వాత అఖిలేష్ యాదవ్ విజయవాడ వెళ్లి అక్కడి నుంచి విమానాల్లో వారి రాష్ట్రాలకు వెళ్తారు.
- సీఎం కేసీఆర్ కూడా ఖమ్మం నుంచి నేరుగా హెలీకాప్టర్‌లో హైదరాబాద్ బయలుదేరతారు.

రెడ్‌క్రాస్‌కు ఉత్తమ అవార్డు


కలెక్టర్ అనుదీప్‌తో రెడ్‌క్రాస్ సంస్థ బాధ్యులు

భద్రాచలంఅర్బన్: ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆర్గనైజేషన్ ద్వారా అందించిన అనేక సేవా కార్యక్రమాలకు గుర్తింపుగా జిల్లా రెడ్ క్రాస్ సంస్థ రాష్ట్రస్థాయిలో ఉత్తమ సేవా అవార్డు అందుకుంది. ఈ సందర్భంగా కలెక్టర్, రెడ్ క్రాస్ సొసైటీ చైర్ పర్సన్ అనుదీప్‌ను రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా అధ్యక్షులు, సొసైటీ సభ్యులు మంగళవారం కలిసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షులు ఎస్.ఎల్. కాంతారావు, కోశాధికారి జి.రాజిరెడ్డి వై. సూర్యనారాయణ, ఆరుద్ర, సత్యనారాయణ, బి. కామేశ్వరరావు పాల్గొన్నారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.13,881

సింగరేణి అధికారి కుమారుడి ప్రతిభ


దర్శకుడు రాజమౌళి, సంగీత దర్శకుడు కీరవాణితో జీవన్‌బాబు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి అధికారి కుమారుడు గుమ్మినేని జీవన్‌బాబుకు గుర్తింపు లభించింది. ప్రముఖ సినీ దర్శకుడు ఎస్ఎస్ రాజమౌళి దర్శకత్వం వహించిన ఆర్‌ఆర్‌ఆర్ చిత్రంలో ఎంఎం కీరవాణి స్వరపరిచిన 'నాటు నాటు'పాటకి గ్లోబల్ గోల్డ్ అవార్డు వచ్చిన విషయం విదితమే. ఈ అవార్డును అమెరికాలోని లాస్ ఏంజిల్స్‌లో కీరవాణికి ప్రదానం చేశారు. సింగరేణిలో జూనియర్ టెక్నికల్ అధికారి గుమ్మినేని రాయమల్లు కుమారుడు జీవన్‌బాబు నాటు నాటు పాట స్వరపర్చిన బృందంలో కీబోర్డు ప్లేయర్‌గా పనిచేశాడు. దీంతో కొత్తగూడెం అభ్యుదయ కళాసేవా సమితి అధ్యక్షుడు మద్దెల శివకుమార్, సింగర్ అల్లి శంకర్, సినీ నటులు ధన్‌రాజ్, సంగీత దర్శకులు మారపాక కృష్ణస్వామి, కలవల రాందాసు, విజయ్‌కుమార్ జీవన్‌బాబు ను ఫోన్‌లో అభినందించారు.

మహిళపై దాడి

దమ్మపేట: మహిళను అసభ్య పదజాలంతో దూషించడమే కాక, భౌతికంగా దాడికి పాల్పడిన ఘటన మండలంలోని నాచారం గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. ఈ నెల 15వ తేదీన నాచారం గ్రామానికి చెందిన వేముల ఈశ్వరి (23)ని అదే గ్రామానికి చెందిన మల్లె నాగేశ్వరరావు, వల్లెపు మనోజ్, మల్లె బాలకృష్ణ.. వ్యక్తిగత కారణాలను దృష్టిలో పెట్టుకుని అసభ్య పదజాలంతో దూషించారు. అంతేగాక ఆమె సోదరి వేముల దివ్య సాయంతో భౌతిక దాడికి పాల్పడ్డారు. బాధితురాలు వేముల ఈశ్వరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్ఐ ప్రతాప్‌రెడ్డి తెలిపారు.

వరకట్న వేధింపుల కేసు నమోదు

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని రాజుపేటకాలనీకి చెందిన తరుణశ్రీ అనే మహిళను తన భర్త ప్రతాప్‌రెడ్డి కొంతకాలంగా వరకట్నం కోసం వేధింపులకు గురిచేస్తున్నాడు. కుటుంబాన్ని వదిలేసి ఎక్కడో ఉంటున్నాడని మంగళవారం తరుణశ్రీ స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో ప్రతాప్‌రెడ్డిపై వరకట్న వేధింపుల కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

సైబర్‌క్రైం ఘటనపై...

దుమ్ముగూడెం: మండలంలోని ములకపాడు గ్రామానికి చెందిన జల్లి స్పందన సైబర్ మోసానికి గురైంది. ఆన్‌లైన్‌లో డబ్బులు వస్తాయని నమ్మించి గుర్తుతెలియని దుండగులు ఆమె ఖాతా నుంచి నగదు మాయం చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు మంగళవారం పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలిలా ఉన్నాయి.. ఇన్‌స్టాగామ్‌లో వచ్చిన జాబ్ యాడ్ చూసిన మహిళ అందులో వీడియోలు చూసినందుకు మొదట రూ.280 తర్వాత రూ.340 చెల్లించారు. నాలుగు టాస్కులు పూర్తి చేస్తే నగదును డబుల్ డ్రా చేసుకోవచ్చని తెలిపిన దుండగులు ఆమె ఖాతా నుంచి మొదటగా రూ.3,500, రూ.7,000, రూ.20,000 మాయం చేశారు. మరో రూ.40 వేలు వేస్తే ఇప్పుడు ఇచ్చిన నగదు మొత్తం వస్తాయని తెలపడంతో మోసపోయానని గ్రహించిన స్పందన స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రవికుమార్ తెలిపారు.

చికిత్స పొందుతున్న మహిళ మృతి

అశ్వారావుపేటరూరల్: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న ఓ మహిళ మంగళవారం మృతి చెందింది. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని వాగొడ్డుగూడేనికి చెందిన సోడెం రాజు తన భార్య భద్రమ్మ (42)తో కలిసి ద్విచక్రవాహనంపై గత ఆదివారం రాత్రి తమ స్వగ్రామమైన ఏపీలోని ఏలూరు జిల్లా జీలుగుమిల్లి మండలం గోపాలపురం వెళ్లే క్రమంలో గ్రామ సమీపంలోనే అదుపుతప్పి కిందపడిపోయారు. ఈ ప్రమాదంలో భద్రమ్మ తలకు బలమైన గాయం కాగా, కొత్తగూడెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్న క్రమంలోనే పరిస్థితి విషమించి మృతి చెందింది. స్థానిక పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తేజ మిర్చి కొనుగోలు కేంద్రాల ఏర్పాటు

చుంచుపల్లి: జిల్లాలో మూడు మండలాల పరిధిలో తేజ మిర్చి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు డీఆర్డీఓ జి.మధుసూదన్‌రాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సెర్ప్ సంస్థ ఆధ్వర్యంలో ఇల్లెందు, టేకులపల్లి, చంద్రుగొండ మండలాల్లో ఈ కొనుగోలు కేంద్రాలు అందుబాటులో ఉంటాయని, రైతులు గమనించి సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

యువజన సమ్మేళనానికి ఏజెన్సీ యువత

భద్రాచలంఅర్బన్: ఈనెల 19 నుంచి 25వరకు పుదుచ్చేరిలో జరుగనున్న 14వ ట్రైబల్ యూత్ ఎక్స్ఛేంజ్‌లో పాల్గొనేందుకు భద్రాచలం ఏజెన్సీకి చెందిన 28 మంది యువతీ, యువకులు మంగళవారం తరలివెళ్లారు. పంపారు. వారికి అవసరమైన వస్తువులు, దుస్తులు తదితర సామగ్రిని సీఆర్పీఎఫ్ అధికారులు సమకూర్చారు. వారం రోజుల పాటు జరిగే వివిధ సంస్కృతి, భాష, జీవనశైలి, విద్యామార్గాలు, అభివృద్ధి కార్యకలాపాలను అర్థం చేసుకునేందుకు యువతకు ఈ అవకాశం కల్పించినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో 141 సీఆర్పీఎఫ్ కమాండెంట్ ప్రశాంత్‌ధర్‌తో పాటు సెకండ్ ఇన్ కమాండెంట్ కమల్వీర్ యాదవ్, ఐటీడీఏ అధికారులు పాల్గొన్నారు.